సాక్షి
వికారాబాద్

శనివారం । 16 । ఆగస్టు । 2025



ఉత్తమ సేవలకు అవార్డులు

ఉత్తమ సేవలు అందించిన అధికారులకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అవార్డులు అందజేశారు. 8లో▸



నష్టపరిహారం అందించాలి

వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. 9లో▸



నిబంధనలు అతిక్రమిస్తే..

వాహనదారులు ఆర్టీఏ నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేస్తామని తాండూరు రూరల్ సీఐ నగేశ్ హెచ్చరించారు. 9లో▸

న్యూస్‌రీల్

రూ.కోటితో మేకల షెడ్డు

ఏఎంసీ డైరెక్టర్ యాదగిరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి

బంట్వారం: మండల కేంద్రంలో మేకల షెడ్డు నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరైనట్లు మర్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరి తెలిపారు. శుక్రవారం బంట్వారంలో సహచర డైరెక్టర్లు శాకం నర్సింలు ,ఇసాక్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ సహకారంతో చైర్మన్ మహేందరెడ్డి మార్కెట్‌ను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఇటీవల మండల కేంద్రంలో ఎకరం ప్రభుత్వ భూమిలో మేకల సంతను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం మంజూరైన నిధులతో మేకల షెడ్డు, ప్రహరీ, సీసీ రోడ్డు, బోరు వేయనున్నట్లు వివరించారు.

సీఎం పర్యటన వాయిదా

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ పర్యటన వాయిదా పడినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తేదీ మార్పు చేసినట్లు తెలిపారు. ఈ నెల చివరి వారంలో సీఎం పర్యటన ఉండవచ్చన్నారు.

ధారూరు మండల ప్రత్యేకాధికారిగా రాజేశ్వరి



ధారూరు: మండల ప్రత్యేక అధికారిగా జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజేశ్వరిని కలెక్టర్ ప్రతీక్‌జైన్ నియమించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఆర్డీఓగా పని చేస్తున్న రాజేశ్వరి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొంది వికారాబాద్ జిల్లాకు బదిలీపై వచ్చారు.

నేడు తాండూరుకు మందకృష్ణ మాదిగ రాక



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలో శనివారం నిర్వహించనున్న వికలాంగుల, చేయూత పెన్షన్ దారుల మహాగర్జన సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని ఆ సమితి జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ తెలిపారు. స్థానిక గగరాణి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. శుక్రవారం సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు మాట్లాడారు. వికలాంగులకు రూ.6 వేలు, వృద్ధులకు, వితంతువులకు, చేయూత పెన్షన్ దారులకు రూ.4 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు చించల్‌పేటకు మంత్రులు

నవాబుపేట: మండలంలోని చించల్‌పేటకు శనివారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రులు సీతక్క, అడ్లూరు లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య రానున్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం, బీసీ కమ్యూనిటీ హాల్, పశు వైద్యశాల భవనం, డ్వాక్రా భవనం, ఎస్సీ కమ్యూనిటీ హాల్, ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ భవనం, జీపీ భవనాలను ప్రారంభిస్తారని ఎంపీడీఓ అనురాధ తెలిపారు.

1,500 గాంధీజీ విగ్రహాల ప్రదర్శన

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి మన్నెగూడలోని శ్లోకా ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని 1,500 మహాత్మా గాంధీ విగ్రహాలను ప్రదర్శించారు. గాంధీ గ్లోబల్ క్లబ్ ఫ్యామిలీ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆ సంస్థ చైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రదర్శనతో విద్యార్థులకు గాంధీ గొప్పతనాన్ని తెలియజేయడమే ప్రధాన ఉద్దేశమన్నారు. ఒకే పాఠశాలలో 1,500 విగ్రహాలను ప్రదర్శించినందుకుగాను వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుందని ఇంటర్నేషనల్ చీఫ్ కో-ఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు స్కూల్ ఎండీ చింతల సంగమేశ్వర గుప్తాకు మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం


ప్రజాపాలనతో అన్ని వర్గాలకు సమ న్యాయం

- అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు
- రైతులు, మహిళల సంక్షేమానికి పెద్దపీట
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- కలెక్టరేట్‌లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న స్పీకర్, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

వికారాబాద్: 'రాష్ట్రాన్ని ప్రపంచ వేదికపై సగర్వంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.. స్వాతంత్ర్య ఫలాలు, రాజ్యాంగం కల్పించిన హక్కులు.. సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందాలి' అన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ కలెక్టరేట్ ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్పీకర్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండా ఎగురవేశారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయా స్కూళ్ల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. చక్కటి ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులకు, విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. పోలీసుల పరేడ్ ఆకట్టుకుంది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పథకాల అమలు నిరంతర ప్రక్రియ అన్నారు. రైతు భరోసా పథకం కింద ప్రతి ఎకరాకు రూ.12 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. సాగుభూమి లేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12 వేలు ఇస్తున్నట్లు చెప్పారు. అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలే లక్ష్యంగా సాగుతున్నట్లు వివరించారు. ఆరు గ్యారంటీలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఉచిత బస్సు ప్రయాణాన్ని నాలుగు కోట్ల మంది మహిళలు ఉపయోగించుకున్నారని తెలిపారు. గ్యాస్ సబ్సిడీ పథకం ద్వారా 1,04,300 సిలిండర్లు పంపిణీ చేసినట్లు వివరించారు. గృహ జ్యోతి పథకం ద్వారా 1,39,812 కుటుంబాలు లబ్ధి పొందాయని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.47.99 కోట్లు వెచ్చించిందన్నారు. జిల్లాలో 980 మంది రైతులు మరణించగా రైతు బీమా పథకం ద్వారా బాధిత కుటుంబాలకు రూ.49 కోట్లు చెల్లించినట్లు పేర్కొన్నారు. 1,00,358 మంది రైతులు రుణాలు రూ.849.30 కోట్లను మాఫీ చేసినట్లు తెలిపారు. జిల్లాకు 13,640 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 10,885 నిర్మాణాలకు అనుమతి ఇచ్చామన్నారు. 1,227 మంది లబ్ధిదారులకు బిల్లులు చెల్లించామని తెలిపారు. అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



చిన్నారుల విన్యాసం

విద్య, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి

ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.10 లక్షల వరకు పెంచామని తెలిపారు. ఈ పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు 25,040 మందికి రూ.65.29 కోట్లతో వైద్య సేవలు అందించామన్నారు. అమ్మా ఆదర్శ పాఠశాల పథకానికి 1,062 స్కూళ్లు ఎంపిక చేసి మౌలిక వసతుల కల్పనకు రూ.17.55 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. 126 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరించినట్లు తెలిపారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. కడా ఏర్పాటు చేసి వెనుకబడిన కొడంగల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్వో మంగిలాల్, ఆర్డీఓ వాసుచంద్ర, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న ధారాసింగ్

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

పూజలో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: పెద్దేముల్ తండాలో జై శ్రీరామ్ స్మరణతో మార్మోగింది. ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. హనుమాన్ విగ్రహానికి పండితులు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. ఆ తర్వాత ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన గావించారు. అంతకుముందు ఆలయ నిర్మాణ దాత పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మాజీ సర్పంచ్ తారాబాయి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఫైనాన్స్ కమిటీ మెంబర్ రమేష్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనిప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు అంజయ్య, గోపాల్, మురళీకృష్ణ గౌడ్, మల్లేశం, నారాయణరెడ్డి, మహిపాల్‌రెడ్డి, లొంక నర్సింలు, ఎల్లారెడ్డి, సంపత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, రవి, డీవై నర్సింలు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

బీసీ రిజర్వేషన్లకు ఆమోద ముద్ర

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

తాండూరు: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే ఉద్దేశంతో శాసన సభలో ఆమోద ముద్ర వేశామని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం పెద్దేముల్ తండాకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాల్సి ఉందన్నారు. ఇందుకోసం కాంగ్రెస్ ఉద్యమిస్తోందన్నారు. వికారాబాద్‌లో మూడు రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇందుకు రాష్ట్ర వాటా 25 శాతం, కేంద్రం వాటా 75 శాతం ఉంటుందని వివరించారు. మూడేళ్ల కాలంలో ఈ పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, మురళీకృష్ణాగౌడ్, నారాయణరెడ్డి, శోభారాణి, పట్లోళ్ల బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న డెంగీ



సిబ్బందిని అప్రమత్తం చేస్తున్న వైద్యాధికారులు

- జిల్లా వ్యాప్తంగా 36 కేసులు నమోదు
- తాండూరు పట్టణ పరిధిలో అత్యధికంగా 9 కేసులు
- ప్రైవేటు ఆస్పత్రుల్లో పదుల సంఖ్యలో..
- నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్న అధికారులు

తాండూరు: జిల్లాలో డెంగీ కేసులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. నెల రోజుల వ్యవధిలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 36 కేసులు నమోదయ్యాయి. అందులో అత్యధికంగా తాండూరు మున్సిపాలిటీ పరిధిలో 9 కేసులు ఉన్నాయి. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని రామయ్యగూడలో 6, పుల్‌మద్ది గ్రామంలో 2, యాలాల మండలం అగ్గనూర్ గ్రామంలో 3 కేసుల నమోదయ్యాయి. జిల్లాలో ఇటీవల ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం లోపించింది. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రతి మండలంలో ఒకటి రెండు డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో పదుల సంఖ్యలో కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. తాండూరు పట్టణ పరిధిలోని బస్వణ్ణకట్ట ప్రాంతానికి చెందిన ఓ గర్భిణికి డెంగీ సోకడంతో ప్రైవేటుగా చికిత్స పొందుతోంది. కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా వైద్యాధికారులు, మున్సిపల్ అధికారులు మొక్కుబడి చర్యలతో సరిపెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సీజనల్ వ్యాధులు కూడా భారీగా నమోదువుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదు. పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించినా పట్టించుకునేవారు లేకుండా పోయారని ప్రజలు ఆరోపిస్తున్నారు.


మిషన్లు పనిచేయడం లేదు



తాండూరులో నలుగురికి డెంగీ సోకినట్లు వైద్యశాఖ తెలిపింది. సమాచారం అందిన వెంటనే ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాం. ఫాగింగ్ మిషన్లు పని చేయకపోవడంతో కొంత ఇబ్బంది ఏర్పడింది. రెండు రోజుల్లో మిషన్లు అందుబాటులోకి వస్తాయి.రాగానే ప్రతి వార్డులో ఫాగింగ్ చేస్తాం. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. పరిసరాలు, ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– విక్రమ్‌సింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్

మందులు ఉన్నాయి



జిల్లాలో 36 డెంగీ కేసులు నమోదయ్యా యి. తాండూరు, వికారాబాద్ మున్సిపాలిటీల్లో ఎక్కువ కేసులు ఉన్నాయి. బాధితుల ఇళ్ల వద్ద చర్యలు చేపట్టాం. ఇళ్ల పరిసరాల్లో నీరు నిలవకుండా చూస్తున్నాం. ప్రజలను కూడా అప్రమత్తం చేస్తున్నాం. ప్రస్తుతం వ్యాధి తీవ్రత అంతగా లేదు. డెంగీ సోకగానే మెరుగైన వైద్యం అందిస్తున్నాం. ఆస్పత్రుల్లో మందులు పూర్తిస్థాయిలో ఉన్నాయి.

– రవీంద్ర యాదవ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

- మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ

ఇబ్రహీంపట్నం: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రమ డిమాండ్ చేశారు. అక్టోబర్ 26, 27 తేదీల్లో ఇబ్రహీంపట్నంలో నిర్వహించే ఆ సంఘం 4వ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల శ్రమను ప్రభుత్వం గుర్తించడం లేదని, పని భద్రత కరువైందన్నారు. 25 ఏళ్లుగా పనిచేస్తున్నా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు నోచుకోవడం లేదన్నారు. మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్‌గా యాదయ్య, వైస్ చైర్మన్ గా చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శిగా స్వప్న, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అలివేల, కార్యదర్శిగా పద్మ, కోశాధికారి నవనీత, సభ్యులుగా రాజు, కవిత, బ్రహ్మయ్య, సామేల్, ఉమా, గణేశ్, కిషన్, ఎల్లేశ్, బుగ్గరాములు తదితరులను ఎన్నుకున్నారు.

అక్షరాస్యత వైపు అతివలు!

- స్వయం సహాయక సంఘాల సభ్యులందరికీ చదువు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమం
- త్వరలో అమలు చేసే అవకాశం
- డ్రాపౌట్లకు ఉన్నత విద్య
- జిల్లాలో దాదాపు 40 వేలకు పైగా నిరక్షరాస్యుల గుర్తింపు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం శోభ (ఫైల్)

దోమ: స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. ఉల్లాస్ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. అతివలందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే ప్రక్రియకు ఈ నెల నుంచే అడుగులు పడనున్నాయి. 2017 వరకు సాగిన సాక్షర భారత్ కార్యక్రమం ఆ తర్వాత ఆగిపోయింది. ప్రస్తుతం ఉల్లాస్ పేరిట నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా పోర్టల్, యాప్‌ను రూపొందించారు. ముఖ్యంగా డ్వాక్రా సంఘాల్లోని మహిళలను వంద శాతం అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యం పెట్టుకున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో నిరక్ష్యరాస్యులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. వారందరికీ చదువు చెప్పేందుకు వలంటీర్లను నియమించనున్నారు. సంఘాల్లో చదువుకున్న మహిళలు, ఆసక్తి ఉన్న విశ్రాంత ఉపాధ్యాయులు, విద్యార్థులను వలంటీర్లుగా ఎంపిక చేయనున్నారు.

40 వేలకు పైగా నిరక్షరాస్యులు

జిల్లాలో దాదాపు 40 వేలకు పైగా నిరక్షరాస్యులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరందరి వివరాలను కంప్యూటర్‌లో పొందుపరుస్తున్నారు. పాఠశాలల్లో విద్యావకాశాలు కోల్పోయిన 15 ఏళ్లకు పైబడిన వారందరికీ జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రాథమిక అక్షరాస్యత అందించేందుకు ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) పేరిట ప్రత్యేక కార్యక్రమంతో ముందుకు వెళ్తున్నారు. త్వరలో బోధనను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమం గతేడాదే ప్రారంభం కావాల్సి ఉన్నా వయోజన విద్యాశాఖలో సిబ్బంది కొరత కారణంగా వాయిదా వేశారు. ఈ నెలలో ప్రారంభమై 2027 వరకు కొనసాగనుంది.

ఉల్లాస్‌లో 16 అధ్యాయాలు

- తెలుగు చదవడం, రాయడం
- అంకెలు గుర్తించడం, కూడికలు, తీసివేతలు
- ఆదాయం పెంచుకునే మార్గాలు
- పోషకాహారం, లోపం, అనారోగ్య సమస్యలు
- అమ్మకు బ్యాంక్ ఖాతా
- ఇరుగు పొరుగుతో మాట మంతి
- నైపుణ్యాల అభివృద్ధి అంశాలు
- నిత్య జీవితంలో అసరమయ్యే అంశాలు

అందరికీ చదువు..అందరి బాధ్యత అనే నినాదంతో ఉల్లాస్ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. దీన్ని గ్రామీణ పేదరిక నిర్మూలన(సెర్ప్), తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం(టాస్) సహకారంతో నిర్వహించనున్నారు. నిరక్షరాస్యులకు ప్రాథమిక విద్యతోపాటు డిజిటల్ అక్షరాస్యత, కీలమైన జీవన నైపుణ్యాలు, ఆర్థిక అక్షరాస్యత, వృత్తి నైపుణ్యం, నిరంతర విద్యను అందించే లక్ష్యంతో ముందుకు సాగనున్నారు. జిల్లాలో గుర్తించిన నిరక్షరాస్యులు, వలంటీర్ల పేర్లను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేస్తారు. వారికి ప్రభుత్వ, ప్రభుత్వేతర పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, కమ్యూనిటీ సెంటర్లు తదితర వాటిలో తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డీటీహెచ్, టీశాట్ ఛానెల్ నంబర్ 14లో క్రమం తప్పకుండా ప్రాంతీయ భాషల్లో వయోజన అభ్యాసకుల కోసం పాఠాలను ప్రసారం చేయనున్నారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు పుస్తకాలను తయారు చేస్తున్నారు. ఉల్లాస్ కార్యక్రమం కింద స్వచ్ఛందంగా పని చేసే చురుకైన విద్యార్థులకు విద్యా క్రెడిట్‌లను ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈ అనుబంధ సంస్థలకు యూజీసీ ద్వారా ఆదేశాలు అందాయి. ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కార్పొరేట్ సంస్థలను భాగస్వాములు చేస్తున్నారు. నిరక్షరాస్యులందరికీ వలంటీర్లే చదువు నేర్పించాల్సి ఉంటుంది. ఒక్కొక్కరు 10 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి. ఆసక్తి ఉన్న వారిని 10వ తరగతి వరకు ప్రోత్సహించాలి. ఏదైనా కారణాలతో 10వ తరగతి మానేసినట్లయితే వారందరినీ గుర్తించి ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ చదువుకునేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

సద్వినియోగం చేసుకోవాలి

ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంది. దీన్ని నిరక్ష్యరాస్యులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించే అవకాశం ఉంది.

– శోభ, ఏపీఎం, దోమ

క్లుప్తంగా

వర్షానికి కూలిన ఇల్లు


ఆదుకోవాలని వేడుకుంటున్న లక్ష్మి

దోమ: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఓ ఇల్లు కూలిపోయింది. ఈ ఘటన దోమ మండలం గొడుగోనిపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్డే లక్ష్మికి ఏళ్ల నాటి బండల ఇల్లు ఉంది. వర్షాలకు పాక్షికంగా దెబ్బతిని వెనుకభాగంలో సగం కూలిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు వేడుకుంది.

మహిళ అదృశ్యం


స్వర్ణలత

మోమిన్‌పేట: మహిళ అదృశ్యమైన సంఘటన మోమిన్‌పేటలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చంద్రాయన్‌పల్లికి చెందిన ఓ వ్యక్తితో ఏడాది క్రితం సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం మాచిరెడ్డిపల్లికి చెందిన స్వర్ణలత(19)కు వివాహం జరిగింది. గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు మోమిన్‌పేటలో పని ఉందని చెప్పి స్వర్ణలత ఇంటి నుంచి బయటికి వెళ్లింది. తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. స్వర్ణలత తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకి తెలిస్తే సెల్ నంబర్ 8712670037కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ద్విచక్ర వాహనం ఢీ కొని మహిళ మృతి

మణికొండ: బతుకుదెరువు వచ్చి గృహాల్లో పని చేసుకుంటున్న ఓ మహిళను శుక్రవారం ఓ ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన నార్సింగి మున్సిపాలిటీలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా కన్నాయిగూడెంకు చెందిన టి.మంజుల(44) నార్సింగిలో నివసిస్తూ పలు గృహాలలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తుంది. రోజూలానే బృందావన్ కాలనీలో పనిముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో నార్సింగి- గండిపేట మెయిన్ రోడ్డును దాటుతున్న క్రమంలో పొలామీ-90 అపార్ట్‌మెంట్ ముందు ఏపీ 26సీబీ 2626 నెంబరు ద్విచక్ర వాహనం వేగంగా ఢీ కొట్టింది. దాంతో ఆమె తల, నడుము కింది భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను నార్సింగిలోని పల్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆస్పత్రి వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

ఎంఎంఎస్ అందుకున్న ఏసీపీ మోహన్‌కుమార్

గోల్కొండ కోటలో ప్రదానం చేసిన ముఖ్యమంత్రి

సాక్షి, సిటీబ్యూరో: నగర ట్రాఫిక్ విభాగంలో మధ్య మండల ఏసీపీగా పని చేస్తున్న శ్రీరాముల మోహన్‌కుమార్ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ (ఎంఎంఎస్) అందుకున్నారు. శుక్రవారం గోల్కొండ కోటలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రదానం చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన మోహన్‌కుమార్ 1995లో ఎస్సైగా పోలీసు విభాగంలోకి అడుగుపెట్టారు. 1996-99 మధ్య హబీబ్ నగర్, 2000-03 మధ్య చార్మినార్, 2003-09 మధ్య దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్‌ల్లో ఎస్సైగా విధులు నిర్వర్తించారు. 2009లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఆపై మీర్‌చౌక్, దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్, చార్మినార్, పంజాగుట్ట, తూర్పు మండలం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. 2018లో డీఎస్పీగా పదోన్నతి పొందిన మోహన్‌కుమార్ దక్షిణ మండలం స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా, సూర్యాపేట డీఎస్పీగా, నగర సీసీఎస్, పంజగుట్ట ఏసీపీగా పని చేశారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

కొందుర్గు: అక్రమంగా ఆవులను తరలిస్తున్న రెండు కంటెయినర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా నుంచి హైదరాబాద్ బహదూర్‌పురాకు కంటెయినర్లలో ఆవులను తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో శుక్రవారం మధ్యాహ్నం రామచంద్రాపూర్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఏపి29 టీఏ9171, టీఎస్07 యూజీ5594 నంబర్లు కలిగిన కంటెయినర్లలో అమానవీయంగా 90 ఆవులను తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనాలను సీజ్ చేసి గోశాలకు తరలించారు. వాహనాల డ్రైవర్లు, క్లీనర్లు సునీల్, హతీఫ్‌ఖాన్, శంకర్, మహ్మద్ ఇస్తేశంమొద్దీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపారు. ఆవులను హైదరాబాద్ జియాగూడలోని శ్రీసమరిత్ కామధేను గోశాలకు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ విషయమై దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ఉత్తమ సేవలకు అవార్డులు

జిల్లాలో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రశంసాపత్రాలు అందజేశారు. మొత్తం 289 మంది అధికారులు అవార్డులు అందుకున్నారు. – అనంతగిరి


కమలాకర్‌రెడ్డి డీటీడీఓ


సత్యనారాయణ మెన్స్ ఏడీ


ఉమేష్ పీఆర్ ఈఈ


వెంకటేశ్వర్లు సీపీఓ


స్పీకర్, కలెక్టర్, ఎమ్మెల్యేల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్



జాకీర్ అహ్మద్, విక్రమ్‌సింహారెడ్డి, వికారాబాద్, తాండూరు మున్సిపల్ కమిషనర్లు


భీంకుమార్ వికారాబాద్ సీఐ


అబ్దుల్ హఫీజ్ డీఎస్‌బీ ఎస్ఐ


వీరన్న లైజన్ ఆఫీసర్ ఎస్ఐ


ఫర్హీన్ ఖాతూన్ కలెక్టరేట్ ఏఓ


మోహన్‌కృష్ణ, జిల్లా మార్కెటింగ్ అధికారి


వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ డీఎం


నఫీజ్ ఫాతిమా, సూపరింటెండెంట్


నరేందర్, కలెక్టర్ సీసీ


రామకృష్ణ, అడిషనల్ కలెక్టర్ సీసీ


విజయ్‌కుమార్, అడిషనల్ కలెక్టర్ సీసీ


ఉమాశంకర్ వీసీ కోఆర్డినేటర్


దుద్యల్: పక్కీరప్ప, జూ.అసిస్టెంట్


అశోక్, డీఆర్‌డీఓ సీసీ


మోమిన్‌పేట: జైపాల్‌రెడ్డి, వార్డెన్


శిరీష, జూ. అసిస్టెంట్ (ఆర్‌డీఓ ఆఫీస్)


సురేష్, సీ. అసిస్టెంట్ (వికారాబాద్)


శ్రీహరి, సర్వేయర్ (వికారాబాద్)


కొడంగల్: సాకేత్ వైద్యాధికారి


సరోజ, జూ.అసిస్టెంట్ (వికారాబాద్)


మర్పల్లి: వెంకటేశం, ఆర్ఐ


మర్పల్లి: అంజిరెడ్డి, ఏపీఓ


దోమ: పర్వేజ్, సీ.అసిస్టెంట్


దోమ: రాజేశ్, జీపీ కార్యదర్శి


కుల్కచర్ల: సంతోష్, జీపీ కార్యదర్శి

మనీమ్యూల్స్‌కు షెల్టర్!

- 48 గంటల పాటు వారికి హోటళ్లలో బస ఏర్పాటు
- ఖాతాల యాక్టివేషన్ ప్రక్రియ మొత్తం పూర్తి కావడానికే..
- విదేశాల్లో తిష్టవేసిన 'సైబర్ సూత్రధారుల' కొత్త ఎత్తు
- తాజా కేసుల దర్యాప్తులో గుర్తించిన సైబర్ క్రైమ్ కాప్స్

సాక్షి, సిటీబ్యూరో: కాంబోడియా, దుబాయ్, మయన్మార్ కేంద్రంగా సైబర్ క్రైమ్ సిండికేట్స్ నిర్వహించిన సూత్రధారులు అనుసరిస్తున్న కొత్త పంథాను సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. బాధితుల నుంచి డబ్బు డిపాజిట్ చేయడానికి అవసరమైన బ్యాంకు ఖాతాలను అందించే మనీమ్యూల్స్‌ను 48 గంటల పాటు దళారుల ఆధీనంలో, హోటల్ రూమ్స్‌లో ఉంచుతున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. వారి పేర్లు, వివరాలతో తెరిచిన బ్యాంకు ఖాతాలు యాక్టివేషన్ పూర్తి కావడంతో పాటు నగదు డిపాజిట్లు మొదలు కావడంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండటానికే సూత్రధారులు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు చెప్తున్నారు.

తమ ఖాతాలు వాడకుండా మూల్స్‌వి..

కాల్‌సెంటర్ల ఏర్పాటు చేసి మరీ వివిధ రకాలైన సైబర్ నేరాలు చేయిస్తున్న సూత్రధారులు ఇటీవల కాలంలో విదేశాల్లోనే ఉంటున్నారు. వీళ్లు బాధితుల నుంచి డబ్బు డిపాజిట్ చేయించుకోవడానికి తమ ఖాతాలు వినియోగించరు. టెలిగ్రాం, సిగ్నల్ తదితర సోషల్‌మీడియాల్లో గ్రూపులు ఏర్పాటు చేయడం ద్వారా తమకు సహకరించే దళారుల్ని గుర్తిస్తున్నారు. వీరి ద్వారా ఆయా ప్రాంతాల్లో ఉన్న చిరుద్యోగులు, నిరుద్యోగులు, చిన్న చిన్న వ్యాపారులను ఆకర్షిస్తారు. వీరి కేవైసీ వివరాలతో, బోగస్ కంపెనీలు తెరిచి ఆపై బ్యాంకు ఖాతాలు తెరిపిస్తుంటారు. ఈ ఖాతాల ద్వారా జరిగే లావాదేవీలపై కమీషన్లు తీసుకునే వారిని మనీ మ్యూల్స్‌గా పరిగణిస్తుంటారు. ఒకప్పుడు ఈ బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన వివరాలు, డెబిట్ కార్డులు, చెక్‌బుక్స్ తదితరాలు తీసుకోవడంతో మనీమ్యూల్స్‌ను దళారులు పంపేసేవాళ్లు.

ఖాతాలు దొరకడం గగనం కావడంతో..

ఇలా మనీమ్యూల్స్ ద్వారా తెరిచిన బ్యాంకు ఖాతాల్లో కొన్ని సాంకేతిక కారణాలతో పూర్తిస్థాయిలో యాక్టివేట్ అయ్యేవి కాదు. ఆ ప్రక్రియ పూర్తి చేయడానికి మ్యూల్స్ అందుబాటులో ఉండరు. దీంతో ఆయా ఖాతాలను సూత్రధారులు వదిలేసేవాళ్లు. గతంలో పోలీసులు సైతం ఈ మనీ మ్యూల్స్ విషయంలో ఉదాసీనంగా వ్యవహరించేవాళ్లు. అయితే కొన్నాళ్లుగా ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటున్న దర్యాప్తు అధికారులు వీరితో పాటు దళారులను అరెస్టు చేస్తున్నారు. ఈ కారణంగానే బ్యాంకు ఖాతాలు లభించడం సూత్రధారులకు గగనంగా మారిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఏ ఒక్క మ్యూల్ ఖాతాను వదలకూడదని సూత్రధారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే దళారుల ద్వారా కనీసం 48 గంటల పాటు మ్యూల్స్‌కు షెల్టర్ ఏర్పాటు చేస్తున్నారు. దళారులు నివసించే ప్రాంతంలో ఉండే లాడ్జిలు, హోటళ్లనే దీనికోసం వినియోగిస్తున్నారు. ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఖాతాల యాక్టివేషన్, ప్రాథమిక లావాదేవీలను సూత్రధారులు పూర్తి చేస్తున్నారు.

'సహజవనరుల పరిరక్షణ అందరి లక్ష్యం కావాలి'

హైడ్రా కమిషనర్ రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: సహజవనరుల పరిరక్షణ సమాజంలో అందరి లక్ష్యం, బాధ్యత కావాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అభిప్రాయపడ్డారు. అప్పుడే మెరుగైన జీవనాన్ని కొనసాగించగలమని స్పష్టం చేశారు. హైడ్రా ఆ దిశగా పని చేయడానికి పునరంకితం కావాలని ఆకాంక్షించారు. బుద్ధభవన్‌లోని హైడ్రా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగంలో పేర్కొన్న మేరకే నగరంలో గొలుసుకట్టు చెరువుల పరిరక్షణ కోసం హైడ్రా పని చేస్తోందన్నారు

మూసారాంబాగ్ వంతెన హైడ్రా క్లియరెన్స్...

హిమాయత్‌సాగర్ నుంచి భారీ మొత్తంలో నీటిని కిందకు వదలడంతో మూసీ నదిలో ప్రవాహం పెరిగింది. పై నుంచి వరదతో పాటు కొట్టుకువచ్చిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు మూసారాంబాగ్ వంతెన వద్ద నిలిచిపోతున్నాయి. ఇవి అడ్డం పడి నదీ ప్రవాహానికి ఆటంకంగా మారుతున్నాయి. ఫలితంగా చాదర్‌ఘాట్, మూసారాంబాగ్‌లోని శంకర్‌నగర్, మూసానగర్, రసూల్‌పుర తదితర బస్తీలను వరద ముంచెత్తుతోంది. ఈ విషయం గుర్తించి శుక్రవారం రంగంలోకి దిగిన హైడ్రా బృందాలు మూసారంబాగ్ వంతెన వద్ద క్లియరెన్స్ చేపట్టాయి. అక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులు నిర్వహిస్తున్నాయి. గుర్రపు డెక్కతో పాటు గడ్డి, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తోంది. రెండు జేసీబీలతో పాటు టిప్పర్లను అక్కడే ఉంచిన అధికారులు చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తున్నారు. దీంతో వరద సాఫీగా ముందుకు సాగుతోంది.

రైజింగ్ స్టేట్‌గా తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: దేశంలో నంబర్ వన్ రైజింగ్ స్టేట్‌గా తెలంగాణ నిలుస్తోందని అటవీ దళాల ప్రధాన సంరక్షణాధికారిణి (పీసీసీఎఫ్) డాక్టర్ సువర్ణ పేర్కొన్నారు. అరణ్యభవన్‌లో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా సువర్ణ జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు పురస్కారాలను సీనియర్ అధికారులతో అందజేశారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

కేశంపేట: దేవాలయ నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఓ కూలీ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కేశంపేట గ్రామంలో నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయ పనులు చేసేందుకు తమిళనాడు రాష్ట్రానికి చెందిన రాజుకు కాంట్రాక్ట్ ఇచ్చారు. అతడి వద్ద అదే రాష్ట్రానికి చెందిన విజయబాలన్(40) పనులు చేసేందుకు గురువారం గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం పనులు చేస్తుండగా దేవాలయం పక్కనుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. గమనించిన గ్రామస్తులు చికిత్స నిమిత్తం విజయబాలన్‌ను కేశంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అటు నుంచి అంబులెన్స్‌లో షాద్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు.

అనాథాశ్రమంలో వృద్ధుడి మృతి


కన్నప్పస్వామి (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: అనారోగ్యంతో అనాథాశ్రమంలో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాదర్‌గుల్‌లో ఉన్న మాతృదేవోభవ అనాథ ఆశ్రమంలో కన్నప్ప స్వామి(66) రెండేళ్ల క్రితం నాంపల్లి రైల్వేస్టేషన్ ఫుట్‌పాత్ సమీపంలో సంచరిస్తుండగా తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. కొద్ది రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన గురువారం మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియలేదని, కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

దక్షిణమధ్య రైల్వేలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వేలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో జరిగినఆ వేడుకల్లో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ జాతీయ జెండాను ఎగురవేశారు. ఆర్‌పిఎఫ్ నిర్వహించిన పరేడ్‌లో పాల్గొని గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకల్లో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్, సీనియర్ రైల్వే అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు, రైల్వే పాఠశాల,కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వార్డు ఆఫీస్‌పై ఎగరని జెండా


కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్‌ను ప్రశ్నిస్తున్న స్థానికులు

చిలుకూరులో మున్సిపల్ కమిషనర్‌ను నిలదీసిన ప్రజలు

మొయినాబాద్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ పరిధిలోని వార్డు కార్యాలయాల వద్ద శుక్రవారం జాతీయ జెండాను ఎగరవేయకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది జనవరిలో మొయినాబాద్ మున్సిపాలిటీ కొత్తగా ఏర్పడింది. ఇందులో మొయినాబాద్, పెద్దమంగళారం, చిలుకూరు, అప్పోజీగూడ, హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, ఎనికేపల్లి, ముర్తుజగూడ, సురంగల్ గ్రామ పంచాయతీలు విలీనమయ్యాయి. ఈ గ్రామాలు పంచాయతీలుగా ఉన్నప్పుడు జీపీ కార్యాలయాల వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాను ఎగురవేసేవారు. ప్రస్తుతం మున్సిపాలిటీగా మారడంతో పంచాయతీ కార్యాలయాలను వార్డు ఆఫీసులుగా మార్చారు. అయితే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం వార్డు కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగురవేయకపోవడంతో చిలుకూరు గ్రామస్తులు మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్‌ను నిలదీశారు. వార్డు కార్యాలయాల వద్ద జాతీయ జెండా ఎగురవేయవద్దనే నిబంధన ఎక్కడైనా ఉందా అంటూ ప్రశ్నించారు. కమిషనర్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ స్థానికులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. మరోవైపు మిగతా గ్రామాల్లోని వార్డు కార్యాలయాల వద్ద సైతం జాతీయ జెండా ఎగరవేయకపోవడంతో ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ జాతీయ జెండాను అవమాన పరిచే విధంగా వ్యవహరించారని మండిపడ్డారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

కందుకూరు సీఐ సీతారామ్


సరస్వతిగూడలో అవగాహన కల్పిస్తున్న సీఐ

కందుకూరు: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ సీతారామ్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని సరస్వతిగూడలో ఎస్ఐలు పరమేష్, మహేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంబాలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి డ్రగ్స్, మద్యంపై యువతకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మద్యం, గంజాయి, డ్రగ్స్ మత్తులో నేటి యువత చిత్తవుతుందన్నారు. విచక్షణ కోల్పోయి సైకోలుగా ప్రవర్తిస్తున్నారన్నారు. వీటిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ లాంటి మాదకద్రవ్యాలు తీసుకున్నట్లు తమ దృష్టికి వస్తే శాఖాపరంగా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అందరితో డ్రగ్స్ వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌ముదిరాజ్, యాదయ్య, రాము, మహేందర్, వినోద్, వంశీ, మల్లేష్, మహేందర్, జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, అంజయ్య, కుమార్, యాదయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత కీలకం


పాఠశాల విద్యార్థులతో డాక్టర్ సుకుమార

కేశంపేట: దేశాభివృద్ధిలో యువత కీలకమని భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ కమిషనర్ డాక్టర్ సుకుమార అన్నారు. మండల కేంద్రంలోని ఎడ్యుకాజ్ పాఠశాలలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో అనేక శక్తిసామర్థ్యాలు ఉన్నాయని, యువత సద్వినియోగం చేసుకోని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకాస్ డైరెక్టర్లు నిరంజన్ శాస్త్రి, కిరణ్‌కుమార్ రెడ్డి, ఉషస్విని, పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


ఆలయంలో కొనసాగుతున్న పూజలు

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో రెండు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచే గ్రామస్తులంతా కలిసిమెలిసి పూజలో భాగమయ్యారు. పూజారులు మంత్రోచ్చారణలతో ద్వార తోరణ, ధ్వజకుంభ ఆరాధన, గాయత్రీ హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు హాజరై నిష్ఠతో క్రతువులు జరిపించారు.


ప్రతిష్ఠ మహోత్సవంలో గ్రామస్తులు

ఓర్వలేకే తప్పుడు ఫిర్యాదులు


మట్లాడుతున్న భరత్‌కుమార్ తదితరులు

బాటసింగారం సహకార సంఘం మాజీ చైర్మన్ భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: సహకార సంఘం అభివృద్ధిని చూసి ఓర్వలేక తనపై తప్పుడు ఫిర్యాదులు చేసి పదవి నుంచి తప్పించారని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం మాజీ చైర్మన్ చేగూరి భరత్ కుమార్ అన్నారు. తారామతిపేటలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన హయాంలో ఎక్కడా అవినీతి జరగలేదన్నారు. కేవలం ఏడాదిన్నర కాలంలో దాదాపు రూ.12 కోట్ల మొండి బకాయిలు వసూలు చేశామని తెలిపారు. గతంలో చైర్మన్‌గా పనిచేసిన విఠల్‌రెడ్డి 2013 నుంచి 2020 మధ్యకాలంలో ఎలాంటి తీర్మానం లేకుండా 272 మందికి రూ.23 లక్షలకు పైగా రుణాలపై వడ్డీ మాఫీ చేశారని ఆరోపించారు. ఇదే తరహాలో తాను కూడా 58 మంది నిరుపేద రైతులు, చనిపోయిన రైతు కుటుంబాలకు వడ్డీలో రూ.15 లక్షల 46వేలు మాఫీ చేశామని తెలిపారు. మజీద్‌పూర్ మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డితో పాటు అతని కుటుంబ సభ్యులు సంఘం నుంచి రూ.కోటిన్నర మేర రుణాలు తీసుకుని 11 ఏళ్లుగా చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని, ఇలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరించడంతోనే తనపై కుట్ర చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు మొగుళ్ల యాదిరెడ్డి, మేకల రాములు, చింతల లక్ష్మమ్మల తదితరులు పాల్గొన్నారు.